

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బొమ్మర బోయిన కేశవులు

# సమాచార హక్కు తిరుగులేని బ్రహ్మాస్త్రం

■ సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ డాక్టర్ కేశవులు

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 1: సమాచార హక్కు తిరుగులేని బ్రహ్మాస్త్రమని సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లా ఆత్మీయ సమ్మేళనం, అవగాహన సదస్సును నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పీఏసీసీఎస్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల నుంచి సమాచారాన్ని అడిగి తీసుకొనే అధికారమే సమాచార హక్కు అన్నారు. సామాన్యుడికి ఏ ఆఫీసుకు వెళ్లినా పనిచేయించుకోవటం, తనకు కావలసిన సమాచారాన్ని రాబట్టడం, కష్టతరమైన నేపథ్యంలో భారత ప్రభుత్వం 12 అక్టోబర్ 2005 తేదీన ఈ సమాచార హక్కు చట్టం భారతదేశమంతటా అమలులోకి వచ్చిందన్నారు. దీనిని ఉపయోగించుకొని, ప్రభుత్వ పనులపై సమాచారాన్ని పొందవచ్చన్నారు. ఇంతకుముందు పార్లమెంట్, లేక విధాన సభ లేక విధాన పరిషత్ సభ్యులకు గల ఈ సౌకర్యాన్ని, ఈ చట్టం ద్వారా సామాన్య ప్రజలందరికీ అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ అధికారులు అడగకపోయినా వారంతటా వారే విధి విధానాలు, ఉద్యోగుల బాధ్యతలు మొదలైన 17 అంశాల గురించి సమాచారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. దీని ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సహాయ పౌర సమాచార అధికారి, అప్పిలేట్ అధికారుల పేర్లు, వారి ఫోన్ నెంబర్లను, ప్రజలకు కనిపించే విధంగా బోర్డుమీద స్పష్టంగా రాసి ఉంచాలన్నారు. సమాచార హక్కు చట్టంలో ముత్తం 6 అధ్యాయాలు, 31సెక్షన్లు ఉన్నాయన్నారు. ప్రపంచ గతిని మార్చగల శక్తి ఒక్క 'ఓటు' హక్కుకే ఉన్నదని, అలాంటి ఆయుధాన్ని వృథా చేసుకోవడం, లేదా ప్రలోభాలకు గురై అమ్ముకోవడం వంటివి చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఒక వ్యక్తి అస్తిత్వాన్ని గుర్తించి, వ్యవస్థ మార్పునకు నాంది పలుకుతుంది ఓటు అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ వంతు కర్తవ్యంతో ఉన్నత నాయకులను ఎన్నుకొనే విధానమే ఎన్నిక అన్నారు. ప్రతి పౌరుడు తమ ఓటును వినియోగించుకోవాలని సూచించారు. జలసాధన సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు దుచ్చెర్ల సత్యనారాయణ మాట్లాడుతూ చెట్లను నరకవద్దని, అవి మనకు ఆక్సిజన్‌తోపాటు వాతావరణ మార్పులను కూడా నిలువరిస్తాయన్నారు. వాటి ద్వారా సమస్త జీవరాశికి ఆహారంతోపాటు పండ్లు, ఫలాలు, ఆకుకూరలు కలపతోపాటు జీవవైవిధ్యానికి ఎంతో మేలు కలుగుతుందని చెప్పారు. నీటి సాధన కోసం ఎన్నో సంవత్సరాలు పోరాడి కృష్ణ నీళ్లను నల్గొండ, పాలమూరుకు తెచ్చానని తెలియజేశారు. జాతీయ కోఆర్డినేటర్ గాదం ఉత్తరయ్య మాట్లాడుతూ సమాచార హక్కు పరిసర పరిరక్షణ సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని అక్టోబర్ 12న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ హైదరాబాద్ నగరంలో జాతీయ సెమినార్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి దేశంలోని వివిధ రాష్ట్రాల కన్వీనర్లు, కోఆర్డినేటర్లు, రాష్ట్ర మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్, జ్యూడిషల్ ఆఫీసర్స్ హాజరు కాబోతున్నారని, మీమీ జిల్లాల నుంచి కమిటీ సభ్యులను అధికసంఖ్యలో పాల్గొనే విధంగా కృషి చేయాలని కోరారు.

# ఘనంగా వయోవృద్ధుల దినోత్సవం



వృద్ధులను సన్మానిస్తున్న తాసీల్దార్ శైలేంద్రకుమార్

అచ్చంపేటటౌన్, అక్టోబర్ 1 : అచ్చంపేట పట్టణంలోని ఎస్‌ఏవీ గుప్తా వృద్ధాశ్రమంలో వయోవృద్ధుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అచ్చంపేట తాసీల్దార్ శైలేంద్ర కుమార్ అధ్యక్షత వహించగా మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వయోవృద్ధులు మనకు భా రం కాదు, వారిని చూసుకోవడం మన బాధ్యత అన్నారు. వృద్ధులను చిన్న చూపు చూడకుండా వారిని గౌరవించి వారి హక్కులను కాపాడాలని సూచించారు. అనంతరం వృద్ధులను సన్మానించారు. కార్యక్రమంలో సీడీపీవో దమయంతి, ఎస్‌ఏవీ గుప్తా వృద్ధాశ్రమం చైర్మన్ సంధ్యాగణేశ్, ఏసీడీపీవో, సూపర్‌వైజర్లు, కౌన్సిలర్లు, విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా గణేశ్ నిమజ్జనం

బల్మూరు, అక్టోబర్ 1: మండలంలోని కొండనాగులలో గంగపుత్ర సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపయ్యను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. అంతకు ముందు నిర్వహించిన లడ్డూ వేలంలో మొదటి లడ్డూలను రూ.45 వేలకు ఒక్కటి చొప్పున దక్కించుకున్నారు. అనంతరం ఆటాపాటలతో గణనాథుడిని నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో నిర్వాహకులు లింగం, గంగాధర్, నాగరాజు, శ్రీనివాసులు, యాదయ్య, బాలరాజు, రమేశ్, వెంకటయ్య, తిరుపతయ్య, రాజు, లక్ష్మయ్య, కాంగ్రెస్, టీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత

బల్మూరు, అక్టోబర్ 1: మండలంలోని పోలిశెట్టిపల్లి గ్రామానికి చెందిన లాడసాని బొజ్జయ్య కొన్ని రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం బీఆర్ఎస్ నాయకుడు, విండో చైర్మన్ నర్సయ్య ఆకుటుంబాన్ని పరామర్శించి 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో విండో సభ్యులు అంజన్‌రెడ్డి, నాయకులు సురేశ్, తిరుపతయ్య, సాయిలు, మల్లేశ్, పరమేశ్, శ్రీకాంత్, మహేశ్, నరేశ్ తదితరులు ఉన్నారు.

# పారిశుధ్య కార్మికులకు అందరూ రుణపడి ఉంటారు



ఎమ్మెల్యే గువ్వల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



రోడ్డుపై ఉన్న చెత్తను ఎత్తిన ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

◆ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

◆ అచ్చంపేటలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పాల్గొన్న విప్

అచ్చంపేటటౌన్, అక్టోబర్ 1 : పారిశుధ్య కార్మికులకు ప్రతిఒక్కరూ రుణపడి ఉంటారని వారికి నా తరఫున వందనాలు తెలియజేస్తున్నానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా అచ్చంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులతో కలిసి చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిన్ననే అచ్చంపేట ప్రాంతానికి చెందిన రాజు వ్యక్తిగత స్వచ్ఛతపై దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోటీల్లో పాల్గొని మొదటి స్థానాన్ని దక్కించుకోవడం గర్వకారణం అన్నారు. నల్లమల ప్రాంతంలో జన్మించి దేశ స్థాయిలో మొదటి స్థానం సంపాదించిన రాజును ఆదర్శంగా తీసుకొని ప్రతిఒక్కరూ స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. దేశంలో అచ్చంపేట ఖ్యాతిని తెలిపిన సందర్భంగా రాజును ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలందరూ పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే గ్రామం, పట్టణం, నగరాలు స్వచ్ఛతలో మొదటి స్థానంలో నిలుస్తాయని చెప్పారు. నాకు మీ అందరి పనితీరు పై, మీ పై గౌరవం ఉందని, కరోనా వంటి సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు చేసిన మున్సిపల్ సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు. అచ్చంపేట ప్రజలకు ప్రాణహాని జరగకుండా ఎల్లవేళలా విధి నిర్వహణలో ఉండి సేవలు అందించారని కొనియాడారు. అనంతరం మున్సిపల్ పారిశుధ్య కార్మికులను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్, కౌన్సిలర్లు మన్నుపటేల్, తగరం శ్రీను, ఆకుల శ్రీను, అంతటి శివ, బీఆర్ఎస్ నాయకులు పోలిశెట్టి నరేశ్, మాజీ కౌన్సిలర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లోకి జోరుగా వలసలు

ఉప్పునుంతల, అక్టోబర్ 1 : ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలోకి వలసల ఉపందుకున్నాయని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఉప్పునుంతల గ్రామపంచాయతీ పరిధిలోని గట్టుకాడిపల్లి, ఉప్పునుంతలకు చెందిన 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత, కొత్త తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకపోవాలన్నారు.

గట్టుకాడిపల్లికి చెందిన సీనియర్ నాయకుడు సంతోష్‌రెడ్డి, లొంగమయ్య, దానయ్య, జైపాల్ రెడ్డి, భూపాల్‌రెడ్డి, రమేశ్ తదితరులతోపాటు 50మంది బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, భూపాల్‌రావు, రవీందర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణాశ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కారెక్కిన కాంగ్రెస్ కార్యకర్తలు

అమ్రాబాద్, అక్టోబర్ 1 : మండలకేంద్రానికి చెందిన నూర్‌బాషా కమిటీ సభ్యులైన 14మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం మండల కేంద్రంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ హయాంలో మైనార్టీలకు ఎలాంటి చేయూత అందలేదని కొన్ని వర్గాల వారికి మాత్రమే గుర్తింపు లభించేదన్నారు. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో అన్ని వర్గాల ప్రజలకు సరైన గుర్తింపునిచ్చి అన్ని రకాలుగా ఆదుకుంటున్నారని, అందుకే బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. కార్యక్రమంలో సర్పంచ్ శారద, మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు రాజారాం, జగన్, తిరుపతయ్య, లింగమయ్య, జాఫర్, జావెద్, ఖలీం, తిరుమలయ్య పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి

బల్మూరు, అక్టోబర్ 1: తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌తోనే అన్నివిధాలా అభివృద్ధి జరుగుతుందని విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం మండలంలోని జినుకుంటలో 14 మంది కాంగ్రెస్ మహిళా కార్యకర్తలు క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీను, మాజీవైస్ ఎంపీపీ ఉత్తరమ్మ, నాయకులు రాజు, ప్రేమ్, రమేశ్, గోపాల్‌రావు, సుదర్శన్, శ్రీనుగౌడ్, తదితరులు ఉన్నారు.

## పడకల దవాఖాన ప్రారంభం

ఉప్పునుంతల, అక్టోబర్ 1: మండల కేంద్రమైన ఉప్పునుంతలలో నూతనంగా నిర్మించిన 30 పడకల ప్రభుత్వ దవాఖానను త్వరలోనే ప్రారంభిస్తామని ప్రభుత్వవిప్ గువ్వల బాలరాజు పేర్కొన్నారు. ఆదివారం దవాఖాన భవనాన్ని పరిశీలించి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చి ఆపద సమయంలో మంచి వైద్యాన్ని అందించేందుకు 30 పడకల ప్రభుత్వ దవాఖానను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధునాతనమైన పరికరాలతోపాటు నిపుణులైన వైద్యాధికారులతో వైద్య సేవలు అందించనున్నట్లు చెప్పారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు రవీందర్‌రావు, బాలునాయక్, కృష్ణయ్య, శ్రీను, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# విజయవంతంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు

అమ్రాబాద్, అక్టోబర్ 1 : కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అమ్రాబాద్, పదర ఉమ్మడి మండలాల్లోని అన్ని గ్రామపంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామాల్లో శ్రమదాన కార్యక్రమాలను నిర్వహించారు. మండలకేంద్రంలో సర్పంచ్ శారదాశ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రమదాన కార్యక్రమాల్లో ఎంపీడీవో రామ్మోహన్ పాల్గొని గ్రామంలోని గాంధీ విగ్రహ కూడలిలో ప్రజలతో కలిసి రోడ్లను శుభ్రం చేశారు. అదేవిధంగా గ్రామంలోని అన్ని వీధుల్లో రోడ్లు శుభ్రపరిచి, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మదన్మోహన్, కళాశాల బృందం, ప్రజలు బాల్‌సాయిలు, మల్లేశ్, రాజారాం, జగన్, ఖదీర్‌తోపాటు వైద్యసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కొండనాగుల పాఠశాలలో శుభ్రం చేస్తున్న సర్పంచు, యువకులు

## గువ్వలోనిపల్లిలో స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలు

ఉప్పునుంతల, అక్టోబర్ 1: మండల పరిధిలోని గువ్వలోనిపల్లిలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలను పురస్కరించుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీలో పత్తే రాములమ్మ ఇంటినుంచి పోశమ్మ గుడి వరకు ఉన్న రహదారిని శుభ్రం చేశారు. అదేవిధంగా కంపచెట్లను తొలగించడంతోపాటు మురుగు కాల్వలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో నర్సింగ్‌రావు, ఎంపీడీవో లక్ష్మణ్‌రావు, ఎంపీవో నారాయణ, సర్పంచ్ రఘు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలు

బల్మూరు, అక్టోబర్ 1: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం అధికారులు, సర్పంచుల స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలను నిర్వహించారు. అదేవిధంగా కొండనాగుల ప్రభుత్వ డిగ్రీకళాశాలల్లో విద్యార్థులు శ్రమదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచులు రేవతి, సహదేవు, శివశంకర్, తిరుపతిరావు, సువర్ణ, ప్రియాంక, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.